
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 05.09.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 136 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# కోటి గడపలపై.. టీడీపీ ముద్ర



**175** నియోజకవర్గాల్లోనూ విస్తృతంగా కొనసాగిన కార్యక్రమం

**73.6** శాతం ఇళ్లకు చేరిన టీడీపీ కార్యకర్తలు

కోటి మైలురాయి కార్యకర్తల శ్రమకు ప్రతీక: లోకేష్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అసాధారణ అభివృద్ధిని, ప్రజలకు అందిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ చేరవేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ కార్యక్రమం 40వ రోజుకు చేరుకునే నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఇళ్ల సందర్శన మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. నేడు ఒక్కరోజే అదనంగా మరో 1.30 లక్షల ఇళ్లను సందర్శించడంతో మొత్తం సందర్శనల సంఖ్య కోటికి చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1,35,91,105 ఇళ్లు ఉండగా, ఇప్పటివరకు సందర్శించిన ఇళ్ల సంఖ్య మొత్తం ఇళ్లలో 73.6 శాతానికి చేరడం విశేషం. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్క నియోజకవర్గాన్ని కూడా మినహాయించకుండా ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా కొనసాగుతోంది.

**కార్యకర్తల అంకితభావానికి నిదర్శనం.. సరికొత్త రికార్డులు :** ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం పార్టీ శ్రేణుల విస్తృత భాగస్వామ్యంతో నిరంతరాయంగా దూసుకుపోతోంది. ఈ 40 రోజుల్లో నమోదైన కొన్ని మైలురాళ్లు:ఒకే రోజులో అత్యధికంగా 19,405 బూత్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఒక గరిష్ఠ రికార్డు.

ఒకే రోజులో ఏకంగా 28,397 మంది కార్యకర్తలు క్షేత్రస్థాయి పర్యటనల్లో పాల్గొని సరికొత్త రికార్డు సృష్టించారు.

క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త సగటున రోజుకు 12 ఇళ్లను పలకరిస్తున్నారు.

మొదటి వారం తర్వాత నుంచి ఈ వేగం ఎక్కడా తగ్గకుండా స్థిరంగా కొనసాగుతుండటం పార్టీ శ్రేణుల క్రమశిక్షణకు నిదర్శనం.

ఆగస్టు 8వ తేదీన ఒకే రోజులో అత్యధికంగా 3,51,229 ఇళ్లను సందర్శించారు.

అలాగే ఒకే గంటలో అత్యధికంగా 48,899 ఇళ్లను సందర్శించిన ఘనత కూడా టీడీపీ కార్యకర్తలకే దక్కింది.

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతుంది.

**ప్రతి ఇంటి సందర్శనకు డిజిటల్ ధ్రువీకరణ :** ఈ పర్యటనల్లో ఎక్కడా ఎలాంటి తప్పులకు తావులేకుండా ప్రతి సందర్శనను మై టీడీపీ యాప్‌లో తప్పనిసరిగా టీడీపీ శ్రేణులు నమోదు చేస్తున్నారు. సందర్శించిన ఇళ్లలో 82 శాతం ఇళ్లను ఫొటో ఆధారంగా డిజిటల్ పద్ధతిలో ధ్రువీకరించారు. కచ్చితమైన లెక్కలు, పూర్తి పారదర్శకతతో ఈ కార్యక్రమం జరుగుతుండటం విశేషం.

**ప్రజలు-ప్రభుత్వం మధ్య బలమైన వారధిగా ఇంటింటికీ టీడీపీ :** టీడీపీ ఇంటింటి పర్యటనల్లో కేవలం ప్రభుత్వ విజయాలను వివరించడమే కాకుండా.. ప్రతి కుటుంబం నుంచి వస్తున్న స్పందన, వారి స్థానిక సమస్యలు, అవసరాలను కూడా పార్టీ శ్రేణులు

మిగతా 2లో...



# అంతరిక్షంలో.. మరో విజయగీతం

## జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం

## కక్ష్యలోకి 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం



**శ్రీహరికోట (జర్నలిస్ట్ ఫైల్):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని సాధించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్షకేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. ఈ వాహకనౌక ద్వారా 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్-జీటీఓ)లోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టారు. దేశ రక్షణ, విపత్తుల నిర్వహణతోపాటు వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ తదితర రంగాల్లో ఈ ఉపగ్రహం కీలక సేవలు అందించనుంది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత, 3.13 గంటలకు ఈఓఎస్-05ను సబ్-జీటీఓలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ కక్ష్యలో పెరీజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉన్నాయి. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న ఈ వాహకనౌక ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం.

**విస్తృత భూ పరిశీలన :** ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులోని ప్రత్యేక ఇమేజింగ్ పేలోడ్ ద్వారా విస్తృత ప్రాంతాలను అధిక స్పష్టతతో చిత్రీకరించే అవకాశం ఉంది.

మిగతా 2లో...



# ఇస్రో విజయగాథ.. దేశానికి గర్వకారణం!

శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

అంతరిక్షరంగంలో పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని ప్రశంస

2 లో

# పల్లె చెరువులకు కొత్త కళ

- రూ.50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- ఇప్పటికే 26 చెరువుల పనులు పూర్తి
- వాకింగ్ ట్రాక్‌లు.. పార్కులు.. వ్యాయామ వేదికలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సాగునీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన కింద రాష్ట్రంలోని 105 చెరువులను దాదాపు రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే 26 చెరువుల అభివృద్ధి పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

చెరువుల ఆధునీకరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సాగునీటి వనరులను బలోపేతం చేయడం, భూగర్భ జలమట్టాలను పెంచడం, పర్యావరణ సమతౌల్యాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ప్రభుత్వం పనులు చేపడుతోంది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా చెరువులను కేవలం

మిగతా 2లో...


# వార్డుల పునర్విభజనకు.. ముహూర్తం ఖరారు

- సెప్టెంబరు 5 నుంచి 11 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 13న వార్డుల ప్రకటన.. 14న గెజిట్‌లో ప్రచురణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపి లో మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన ప్రక్రియకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. శుక్రవారం వార్డుల పునర్విభజన

మిగతా 2లో...

# ఫోక్స్‌వ్యాగన్‌లో ఉద్యోగ కల్లోలం




- 2030 నాటికి లక్ష పోస్టులు తగ్గింపు
- భారత్‌లో 12 శాతం ఉద్యోగాలపై వేటు పడే అవకాశం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ ఆటోమొబైల్ రంగంలో దిగ్గజ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ భారీ ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. వ్యయ నియంత్రణ, వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు లక్ష మంది ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. ఇది సంస్థ మొత్తం సిబ్బందిలో దాదాపు 15 శాతానికి సమానం.

మిగతా 2లో...

# ఎల్‌నినో ఉద్ధృతి.. భారత్‌కు ముప్పు!



- 2027 ఫిబ్రవరి వరకు ప్రభావం
- వర్షాలకు గండి.. వేడికి రెక్కలు
- కరవు, వరదలు, తీవ్ర ఉష్ణోగ్రతలపై డబ్ల్యూఎంఓ హెచ్చరిక

2 లో

# తొమ్మిది రోజుల తర్వాత.. అద్భుతం!



- నేపాల్ వరదల్లో టన్నెల్‌లో చిక్కుకున్న ఇద్దరు సజీవంగా వెలికితీత
- మరికొన్ని టన్నెళ్లలో 150 మందికిపైగా ఉన్నట్లు అంచనా
- గల్లంతైన వేలాదిమందిలో మరింత మందిని రక్షించొచ్చన్న ఆశలు

2 లో

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్

- పెరిగిన జనాభా లెక్కలే ఆధారం
- యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ప్రత్యేక కమిషన్ అధ్యయనం
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం




**అమరావతి :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే'లో వెల్లడైన సమకాలీన జనాభా వివరాలు, ప్రత్యేక కమిషన్ నిర్వహించిన అధ్యయనం ఆధారంగానే స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభాలో బిసిలు 50.42 శాతం ఉన్నారని తెలిపింది. 2020లో మొత్తం ఓటర్లలో బిసిల వాటా 48.13 శాతంగా ఉండగా, ప్రస్తుత కుటుంబ సర్వేలో వారి జనాభా మరింత పెరిగినట్లు పేర్కొంది. రాష్ట్రంలోని బిసిల సంఖ్యాబలం, భౌగోళిక విస్తరణ, సామాజిక వైవిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని స్థానిక పాలనలో వారికి కేవలం నామమాత్రపు కాకుండా అర్థవంతమైన ప్రాతినిధ్యం కల్పించేందుకు 34 శాతం రిజర్వేషన్లు అవసరమని నిర్ణయించినట్లు వివరించింది.

బిసిల సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు, వారి జనాభా,

మిగతా 2లో...

# సరికొత్తగా హస్త కళలు

- ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు
- కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- 200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్ల అందజేస్తాం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి.

మిగతా 3లో...

# మెలోనీ రికార్డు.. మోదీ శుభాకాంక్షలు

- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన ఘనత
- మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతానికి ఆమె కృషి కీలకం



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ అరుదైన రికార్డు నెలకొల్పారు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఇటలీలో సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన ప్రధానమంత్రిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ ఘనత నిదర్శనమని పేర్కొన్నారు.

భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో మెలోనీ స్నేహం, నాయకత్వం కీలక పాత్ర పోషించాయని మోదీ కొనియాడారు.

మిగతా 2లో...

# కోటి గడపలపై.. టీడీపీ ముద్ర



(మొదటి పేజీ తరువాయి)

యాప్‌లో డిజిటల్‌గా నమోదు చేస్తున్నాయి. ప్రజల నుంచి వస్తున్న ఈ క్షేత్రస్థాయి సూచనలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఈ కార్యక్రమం ఒక బలమైన వారధిలా నిలుస్తోంది.

కోటి ఇళ్ల మైలురాయి కేవలం ఒక సంఖ్య కాదు.. లక్షలాది టీడీపీ కార్యకర్తల శ్రమ, సమయం, సమన్వయం, అంకితభావానికి ప్రతీక: యువనేత నారా లోకేష్ కేవలం 40 రోజుల్లోనే కోటి ఇళ్ల మైలురాయిని చేరుకోవడంపై పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో అహోరాత్రులు శ్రమిస్తున్న టీడీపీ శ్రేణులను మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ ఘనత వెనుక ప్రతి టీడీపీ కార్యకర్త కృషి, అంకితభావం, క్రమశిక్షణ కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రతి గడపకు వెళ్లి కుటుంబాలను కలుసుకుంటూ, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారని ప్రశంసించారు. ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తూ, ఇంటింటి సందర్శనలను యాప్‌లో నమోదు చేయడం, ఫొటోలు ద్వారా ధ్రువీకరించడం వంటి సాంకేతిక ప్రక్రియలను కూడా కార్యకర్తలు సమర్థవంతంగా అమలు చేశారని తెలిపారు. రోజువారీ లక్ష్యాలను క్రమం తప్పకుండా పూర్తి చేస్తూ, లక్షలాది కుటుంబాలకు చేరువ కావడంలో కార్యకర్తలు చూపిన పట్టుదల అభినందనీయమన్నారు. కోటి ఇళ్ల మైలురాయి కేవలం ఒక సంఖ్య కాదు.. లక్షలాది టీడీపీ కార్యకర్తల శ్రమ, సమయం, సమన్వయం, అంకితభావానికి ప్రతీక. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలిసిన ప్రతి కార్యకర్తకు, ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి నాయకుడికి నారా లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**ఈ విజయం కార్యకర్తలదే: రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**: కేవలం 40 రోజుల్లోనే కోటి ఇళ్ల మైలురాయిని చేరుకోవడం పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఘనత సాధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. కోటి ఇళ్ల సందర్శన వెనుక కార్యకర్తల అంకితభావం, క్రమశిక్షణ, నిరంతర క్షేత్రస్థాయి కృషి కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారని తెలిపారు. కోటి ఇళ్ల మైలురాయి టీడీపీ కార్యకర్తల శ్రమకు ప్రతీక అని, ఈ విజయం పూర్తిగా పార్టీ శ్రేణులదేనని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

# ఇస్రో విజయగాథ.. దేశానికి గర్వకారణం!

**శ్రీహరికోట (జర్నలిస్ట్ ఫైల్)**: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అద్భుతమైన విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రతిష్టాత్మకమైన GSLV-F17 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన అధునాతన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ప్రయోగం.. విజయవంతమైంది. ఈ చారిత్రాత్మక విజయం పట్ల భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి తీవ్ర హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను, ఈ ప్రయోగంలో పరోక్షంగా, ప్రత్యక్షంగా పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. దేశం గర్వించదగ్గ రోజుగా దీనిని ఆయన అభివర్ణించారు.


ప్రధాని మోడి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.... జియోసింక్రోనస్ కక్ష్య నుంచి పని చేసే భారతదేశపు మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహమైన EOS-05 విజయవంతంగా ప్రయోగించబడటం దేశానికి ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈ విజయం భారత అంతరిక్ష రంగాన్ని నిర్వచించే శ్రేష్ఠత, నిరంతర ఆవిష్కరణలు, అంతకంతకూ పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యాలకు నిదర్శనం అని ఆయన కొనియాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా, ఇస్రో, భారతీయ ప్రైవేట్ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం మన అంతరిక్ష కార్యక్రమానికి కొత్త బలాన్ని, మరింత ఉన్నతమైన స్థాయిని జోడిస్తోందని మోదీ స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన కలయిక వల్ల మొత్తం అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో భారతదేశ సామర్థ్యాలు నలుదిశలా విస్తరిస్తున్నాయని ఆయన ప్రశంసించారు.

# వార్డుల పునర్విభజనకు.. ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలు పంపాలని సంబంధిత కార్పొరేషన్లను ఆదేశించింది. సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు ప్రతిపాదనలపై అధికారులు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 12 న తుది ప్రతిపాదనలను పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు పంపనుండగా, 13 న డిలిమిటేషన్ వార్డులను ప్రకటించి, 14 న ఏపి గెజిట్‌లో ప్రచురించనున్నారు. జివిఎంసి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్




(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యాన్ని అధ్యయనం చేసేందుకు మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. కమిషన్ అధ్యయనం, సమకాలీన కుటుంబ సర్వే వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరమే రిజర్వేషన్లు ఖరారు చేశామని పేర్కొంది. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డీ(6), 243-టీ(6) అనుమతిస్తున్నాయని తెలిపింది. సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం కారణంగా రాజకీయ అధికారం, స్థానిక నిర్ణయ ప్రక్రియల్లో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో సమర్థవంతమైన భాగస్వామ్యం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యమని వివరించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 34 శాతం బిసి రిజర్వేషన్లతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించుతాయని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి బివివిపి కుమారరెడ్డి కౌంటర్ దాఖలు చేశారు. బిసిలకు రిజర్వేషన్లు జనాభా శాతం ఆధారంగా నిర్ణయించలేదని, స్థానిక అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, పౌర పాలనలో వారికి సమర్థవంతమైన భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమని రాష్ట్రప్రభుత్వ వివరించింది. అందువల్ల 34 శాతం బిసి రిజర్వేషన్లను సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను కొట్టివేయాలని హైకోర్టును కోరింది.

# అంతరిక్షంలో.. మరో విజయగీతం!

(మొదటి పేజీ తరువాయి)

జియోసింక్రోనస్ కక్ష్యలో ఉండే ఈ ఉపగ్రహం భారత ఉపఖండాన్ని తరచూ పరిశీలించగలదు. ఒకే ఫ్రేమ్‌లో దక్షిణాసియాలోని విస్తారమైన ప్రాంతాన్ని చిత్రీకరించడంతోపాటు సుమారు పది నిమిషాల వ్యవధిలో చిత్రాలను అందించగల సామర్థ్యం దీనికి ఉంది. ఉపగ్రహంలోని ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అత్యుత్తమ స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఇంత అధునాతన ఇమేజింగ్ సామర్థ్యం కలిగిన ఉపగ్రహం భూ పరిశీలన రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.



**రక్షణ, విపత్తుల నిర్వహణకు దోహదం**: ఈఓఎస్-05 నుంచి అందే చిత్రాలు సరిహద్దు ప్రాంతాల పరిస్థితులను పర్యవేక్షించడంతోపాటు కీలక ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించేందుకు ఉపయోగపడనున్నాయి. వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు ఉపగ్రహ డేటా దోహదపడుతుంది. సహాయక, రెస్క్యూ చర్యలు, అత్యవసర ప్రణాళికల రూపకల్పనకు కూడా ఇది ఉపయోగపడనుంది. వ్యవసాయ రంగంలో పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరులను పర్యవేక్షించేందుకు ఈ ఉపగ్రహ డేటా ఉపయోగపడుతుంది. వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాలకు ఇది దోహదం చేయనుంది. అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించడంలోనూ ఈఓఎస్-05 కీలక పాత్ర పోషించనుంది.

**స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలకం**: జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సమర్థవంతంగా పనిచేయడం ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఉపగ్రహాన్ని తొలుత సబ్-జీటీఓలోకి ప్రవేశపెట్టగా, అనంతరం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థ సాయంతో తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది.

2021 ఆగస్టులో జీఎస్ఎల్‌వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. ఆ వైఫల్యానికి ప్రత్యామ్నాయంగా మరింత మెరుగైన సాంకేతికతతో రూపొందించిన ఈఓఎస్-05ను ఇప్పుడు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇస్రోకు ప్రత్యేక విజయంగా నిలిచింది. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని ఇస్రో మరోసారి చాటుకుంది.

**వర్షంలోనూ వీక్షించిన సందర్శకులు**: జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు.

**అంతరిక్ష రంగంలో మరింత బలం**: ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక మిషన్‌గా నిలిచింది. రక్షణ, విపత్తుల నిర్వహణ నుంచి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వరకు అనేక రంగాలకు ఉపయోగపడే ఉపగ్రహ డేటాను అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

# పల్లె చెరువులకు కొత్త కళ

(మొదటి పేజీ తరువాయి)

నీటి వనరులుగానే కాకుండా విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన ఆహ్లాదకర కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు.



ఈ కార్యక్రమంలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్లు, సిట్టింగ్ బెంచీలు, చిల్డ్రన్ పార్కులు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. చెరువుల పరిసరాలను సుందరీకరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి రానుంది.

అనంతపురం, పల్నాడు, శ్రీ సత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో పలు చెరువుల అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలోని గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లాలోని పాలసముద్రం చెరువులు పూర్తిస్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల రైతులకు సాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల స్థిరత్వం పెరగనుంది. చెరువుల చుట్టూ పచ్చదనం, సుందరీకరణ పనులు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది.

అభివృద్ధి పనుల వేగంతో పాటు నాణ్యతకు కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నెలాఖరులోగా మిగిలిన చెరువుల అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్రంలో కార్యక్రమాల అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూడా ధన్యవాదాలు తెలిపారు. సాగునీరు, పర్యావరణం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలను సమన్వయం చేస్తూ చెరువుల ఆధునీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.

# ఫోక్స్‌వ్యాగన్‌లో ఉద్యోగ కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది మార్చిలోనే 50 వేల ఉద్యోగాలను తగ్గించే ప్రణాళికను ప్రకటించిన సంస్థ.. తాజాగా మరో 50 వేల పోస్టులను తగ్గించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. దీంతో మొత్తం లక్ష మంది ఉద్యోగాలపై వేటు పడనుంది.

జర్మనీలో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ ఉద్యోగుల సంఖ్య 2023లో 2.75 లక్షలుగా ఉండగా.. 2026 జూన్ 30 నాటికి 2.54 లక్షలకు తగ్గింది. తాజా నిర్ణయంతో ఈ సంఖ్య మరింత తగ్గనుంది.

**భారత్‌లో 1,000 మందికి ఉద్వాసన?**: ఫోక్స్‌వ్యాగన్ అంతర్జాతీయ ప్రక్షాళన ప్రభావం భారత్‌పైనా పడనుంది. దేశంలోని స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో సుమారు 12 శాతం ఉద్యోగాలను తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. సంస్థ భారత కార్యకలాపాల్లో దాదాపు 9 వేల మంది పనిచేస్తున్న నేపథ్యంలో.. సుమారు 1,000 మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడొచ్చని అంచనా.

రానున్న మూడేళ్లలో వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. అయితే ఉద్యోగుల తొలగింపు సంఖ్యపై వస్తున్న అంచనాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పీయూష్ అరోరా తెలిపారు.

అదే సమయంలో దేశీయ ఇంజినీరింగ్ బృందాన్ని విస్తరించడంతో పాటు.. భారత్‌ను తయారీ, ఇంజినీరింగ్, ఎగుమతులకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పెట్టుబడులు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. భారత్‌లో వ్యాపార నిర్వహణ విధానంలో మార్పుల కోసం బిలియనీర్ సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

**నాలుగు ప్లాంట్లపై అనిశ్చితి**: జర్మనీలోని హనోవర్, ఎండెన్, జ్వికావ్, నెకార్‌సల్మ్ ప్లాంట్ల భవిష్యత్తుపైనా తాజా పునర్వ్యవస్థీకరణ ప్రభావం పడే అవకాశం ఉంది. ఫోక్స్‌వ్యాగన్ చరిత్రలో జర్మనీలోని తయారీ కేంద్రాలు పూర్తిగా మూతపడే పరిస్థితి ఇదే తొలిసారి కావచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ప్లాంట్లపై ఆధారపడిన స్థానిక సరఫరాదారులు, వేలాది మంది కార్మికులపై కూడా దీని ప్రభావం పడుతుందని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఈఓ ఆలివర్ బ్లూమ్ స్పష్టం చేశారు.

**ఉత్తర అమెరికాపై మరింత దృష్టి**: ఉద్యోగాల కోతలకు సంబంధించి ప్రాంతాల వారీగా, సమయానుసారం పూర్తి వివరాలను ఫోక్స్‌వ్యాగన్ ఇంకా వెల్లడించలేదు. భవిష్యత్తులో ఉత్తర అమెరికా మార్కెట్‌పై దృష్టిని పెంచడంతో పాటు.. గ్లోబల్ సౌత్ దేశాలకు ఎగుమతులను విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

తమ ఆధీనంలోని వ్యాపారాలు, సంస్థల సంఖ్యను దాదాపు మూడింట ఒక వంతుకు తగ్గించుకోవడం కూడా కొత్త వ్యూహంలో కీలక భాగంగా ఫోక్స్‌వ్యాగన్ పేర్కొంది.

# మెలోనీ రికార్డు.. మోదీ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇటలీతో సన్నిహిత సహకారాన్ని కొనసాగించేందుకు భారత్ ఎదురుచూస్తోందని తెలిపారు.

**1,413 రోజులుగా నిరంతర పాలన**: జార్జియా మెలోనీ ప్రభుత్వం ఇటలీ రాజకీయ చరిత్రలో అరుదైన ఘనత సాధించింది. 1,413 రోజుల పాటు నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన మెలోనీ.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత సుదీర్ఘకాలం పదవిలో ఉన్న ప్రధానిగా రికార్డు సృష్టించారు.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఇటలీలో ప్రభుత్వాలు సగటున కేవలం 14 నెలలపాటు మాత్రమే కొనసాగాయి. గత 80 ఏళ్లలో ఆ దేశం ఏకంగా 68 ప్రభుత్వాలను చూసింది. తరచూ రాజకీయ సంక్షోభాలు, ప్రభుత్వ మార్పులతో సతమతమైన ఇటలీలో.. 2022లో అధికారంలోకి వచ్చిన మెలోనీ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎలాంటి పెద్ద రాజకీయ సంక్షోభం లేకుండా కొనసాగుతోంది.

**స్థిరమైన నాయకత్వం**: ఇటలీ రాజకీయాల్లో ప్రభుత్వాల స్థిరత్వం అరుదుగా కనిపించే పరిస్థితుల్లో మెలోనీ తన పాలనను కొనసాగించడం విశేషంగా మారింది. నిరంతర పాలనతో ఆమె ఇటలీ రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. ఈ నేపథ్యంలోనే మోదీ ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# ఎల్‌నినో ఉద్ధృతి.. భారత్‌కు ముప్పు!



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్)**: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వం- ✓కు కొనసాగవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) హెచ్చరించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల సరళిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. కరవు, వరదలు, తీవ్రమైన వేడి వంటి విపరీత వాతావరణ పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వెల్లడించింది. ఈ ప్రభావం భారత్‌పై ముఖ్యంగా రుతుపవనాలు, వ్యవసాయ రంగంపై పడే అవకాశం ఉండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**తీవ్రత పెరిగితే.. ప్రభావం అధికమే**: డబ్ల్యూఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌ గురువారం ఎల్‌నినోపై కీలక విషయాలను వెల్లడించారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకునే మార్పుల కారణంగా ఎల్‌నినో ఏర్పడుతుందని తెలిపారు. దీని ప్రభావంతో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కరవులు, వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఎల్‌నినో తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత అధికమవుతాయని హెచ్చరించారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా ఎల్‌నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని ఇటీవల అంచనా వేసింది. తాజాగా డబ్ల్యూఎంఓ కూడా ఇదే తరహా అంచనాలు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**రుతుపవనాలకు దెబ్బ?**: ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాల్లో భారత్‌లో రుతుపవనాలు బలహీనపడే అవకాశం సాధారణంగా కనిపిస్తుంది. ఈ ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 16 శాతం తక్కువ వం- ర్షపాతం నమోదైంది. ఇదే సమయంలో 1901 తర్వాత ఆగస్టులో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత కూడా ఇదే కావడం గమనార్హం.

సెప్టెంబరులోనూ దీర్ఘకాల సగటుతో పోలిస్తే వర్షపాతం 91 శాతం కంటే తక్కువగా ఉండొచ్చని ఐఎండీ అంచనా వేసింది. ఈ పరిణామం వర్షాధార పంటలపై ఆధారపడే రైతాంగానికి ఆందోళన కలిగిస్తోంది.

**తగ్గుతున్న చలికాలం**: ఎల్‌నినో ప్రభావం వర్షాకాలానికే పరిమితం కాకుండా చలికాలంపైనా పడే అవకాశాలున్నాయి. దేశంలో శీతాకాలపు రోజులు క్రమంగా తగ్గుతున్నాయని దిల్లీకి చెందిన క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నట్లు పేర్కొంది.

ఫిబ్రవరిలో ప్రతి దశాబ్దానికి సగటు ఉష్ణోగ్రత 0.69 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతున్నట్లు అధ్యయనం తెలిపింది. మార్చి, ఏప్రిల్ నెలల్లోనూ వరుసగా 0.58, 0.66 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు పేర్కొంది.

**గోధుమ దిగుబడిపై ప్రభావం**: ఉష్ణోగ్రతలు పెరగడం దేశ ఆహార భద్రతపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. శీతాకాలంలో పండించే ప్రధాన రబీ పంట గోధుమలకు అధిక ఉష్ణోగ్రతలు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా పంట కోతకు చేరువలో వేడిగాలులు వీచడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ముందస్తు చర్యలే మేలు**: ఎల్‌నినో దీర్ఘకాలం కొనసాగనున్న సంకేతాల నేపథ్యంలో ప్రభుత్వం, రైతాంగం ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. నీటి నిల్వలు, సాగునీటి వినియోగంపై సమర్థ నిర్వహణతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే విత్తనాల వినియోగంపై దృష్టి పెట్టాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికలో మార్పులు చేసుకోవడం ద్వారా రైతులకు నష్టాన్ని కొంతమేర తగ్గించే అవకాశం ఉంటుంది.

# తొమ్మిది రోజుల తర్వాత.. అద్భుతం!

**నేపాల్**: నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల్లో వేలాదిమంది గల్లంతైన వేళ ఆశలు చిగురించే ఓ ఘటన చోటుచేసుకుంది. శిథిలాలు, మట్టి, బురదతో పూర్తిగా మూసుకుపోయిన జలవిద్యుత్ ప్రాజెక్టు టన్నెల్‌లో చిక్కుకున్న ఇద్దరు కార్మికులు తొమ్మిది రోజుల తర్వాత సజీవంగా బయటపడ్డారు. ఈ ఘటన సహాయక సిబ్బందిలోనే కాకుండా గల్లంతైన వారి కుటుంబాల్లోనూ కొత్త ఆశలు నింపింది.



త్రిశూలి ప్రాంతంలోని త్రిశూలి-3 ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు టన్నెల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆగస్టు 26 న సంభవించిన భారీ వరదలతో టన్నెల్ ప్రవేశద్వారం మట్టి, బురద, శిథిలాలతో పూర్తిగా మూసుకుపోయింది. అప్పటి నుంచి లోపల చిక్కుకున్న కార్మికుల కోసం రెస్క్యూ బృందాలు నిరంతరం గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో తొమ్మిదో రోజు ఇద్దరు కార్మికులు ప్రాణాలతో ఉన్నట్లు గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ తెలిపిన వివరాల ప్రకారం ... రక్షించబడిన వారిలో కబీర్ మహార్జన్ (45), సంజయ్ షా (30) ఉన్నారు. కబీర్ మహార్జన్ త్రిశూలి-3ఏ ప్రాజెక్టులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, సంజయ్ షా నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీలో మెకానికల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. టన్నెల్‌లో తొమ్మిది రోజులపాటు చిక్కుకున్నప్పటికీ వారు ప్రాణాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. టన్నెల్‌లోని ఒక పొడి గదిలో వారు ఉండటం వల్లే ఇంతకాలం ప్రాణాలతో ఉండగలిగారని రెస్క్యూ సిబ్బంది వెల్లడించారు. రక్షించే సమయానికి సంజయ్ షా మాట్లాడే పరిస్థితిలో లేరని అధికారులు తెలిపారు. దీంతో అతడిని వెంటనే విమానంలో బట్టార్ ప్రాంతానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు కబీర్ మహార్జన్ స్పృహలోనే ఉన్నారని ఆయన భార్య వెల్లడించారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను ఖాట్మాండులోని ఛావునీ మిలటరీ ఆసుపత్రికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఇద్దరు కార్మికులను టన్నెల్ నుంచి బయటకు తీసుకొస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ చానళ్లలో ప్రసారమయ్యాయి. బురదతో తడిసిపోయిన ఒక కార్మికుడిని రక్షక సిబ్బంది భుజాలపై మోసుకెళ్లగా.. మరో వ్యక్తిని బయటకు తీసుకొచ్చే సమయంలో చేతులు జోడించి ప్రార్థిస్తున్న దృశ్యం కనిపించింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తొమ్మిది రోజులపాటు చీకటి, బురద మధ్య ప్రాణాల కోసం పోరాడి సురక్షితంగా బయటపడటం నిజంగా అద్భుతమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే నేపాల్‌లోని మరికొన్ని జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లలో కూడా పెద్ద సంఖ్యలో కార్మికులు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దాదాపు అరడజను టన్నెళ్లలో 150 మందికిపైగా చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తం 12 జలవిద్యుత్ ప్రాజెక్టులకు చెందిన సుమారు 900 మంది కార్మికులు గల్లంతైనట్లు స్థానిక అధికారులు చెబుతున్నారు. వీరిలో దాదాపు 500 మంది టన్నెళ్లలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. వారిని గుర్తించి రక్షించేందుకు ఇంజినీర్లు టన్నెళ్లలోకి గాలిని పంపుతూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ఆగస్టు 26న సంభవించిన ఈ ప్రకృతి విపత్తు నేపాల్‌లోని పలు పట్టణాలు, లోయలను తీవ్రంగా ప్రభావితం చేసింది. హిమనదం (గ్లేసియర్) కూలిపోవడం వల్లే ఆకస్మిక వరదలు సంభవించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు 1,259 మంది మృతి చెందగా, 5,000 మందికిపైగా గల్లంతైనట్లు నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. తొమ్మిది రోజుల తర్వాత ఇద్దరు కార్మికులు సజీవంగా బయటపడటంతో.. ఇంకా ఎక్కడైనా శిథిలాలు, టన్నెళ్లలో చిక్కుకుని ఉన్నవారిని కూడా రక్షించవచ్చన్న ఆశలు మరింత బలపడ్డాయి.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి









శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి, సెప్టెంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీకృష్ణుడి జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ద్వారా ధర్మం, సత్యం, ప్రేమ, మానవతా విలువలను ప్రజలకు గుర్తుచేసే పర్వదినంగా శ్రీకృష్ణాష్టమి నిలుస్తుందని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా తెనాలి పట్టణంలోని పలు శ్రీకృష్ణ ఆలయాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, భక్తులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెనాలి పట్టణం, పరిసర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేశారు. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణాష్టమిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.









## కేరళలోని అమృతపురి ఆశ్రమాన్ని సందర్శించిన మంత్రి లోకేష్



• **మాతా అమృతానందమయి దేవితో భేటీ**

**అమృతపురి(కొల్లం)(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాలోని ప్రసిద్ధ అమృతపురి ఆశ్రమాన్ని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం సందర్శించారు. ముందుగా అమృతపురి ఆశ్రమానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని కాళీ దేవాలయాన్ని, కలరిని మంత్రి సందర్శించారు. అనంతరం శ్రీ మాతా అమృతానందమయి దేవితో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు పొందారు. అనంతరం అమృత విశ్వవిద్యాపీఠం క్యాంపస్ ను, అమృత ఆయుర్వేద కళాశాలను మంత్రి సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు ఆశ్రమంలో గడిపారు.

## ఎస్టీల పట్ల అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం సరికాదు



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** లింగాలదిన్నెపల్లి ఎస్టీ కాలనీ చెందిన పేదలు తమ అనుభవంలోని అసైన్డ్ భూములను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యంత్రాలతో సాగు చేసుకుంటుండగా జోకుపల్లికి చెందిన బొగ్గుల దుగ్గిరెడ్డి బసిరెడ్డి రమణారెడ్డిలు అదే గ్రామానికి చెందిన కొంతమంది అమాయకపు దళితులను అడ్డుపెట్టుకొని ఎస్టీల మీద దౌర్జన్యం చేస్తున్నారని ఇటువంటి వారికి రెవిన్యూ వారు వత్తాసు పలకటం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్ విమర్శించారు.

శుక్రవారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీకి చెందిన పేదలు తమ అనుభవంలోని పలుగురాళ్లపల్లె రెవిన్యూ పొలం 1938 సర్వే నంబర్ నందు అసైన్డ్ మెంట్ నందు పట్టాలు పొందిన భూమిలో యంత్రాలతో సాగు చేస్తుండగా అధికార పార్టీకి చెందిన బొగ్గుల దుగ్గిరెడ్డి బసిరెడ్డి రమణారెడ్డిలు జోకు పల్లెకు చెందిన 15 మందితో పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అగ్రవర్ణాలకు మధ్య వాగ్వాదం జరిగింది, అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్ మాట్లాడుతూ లింగాలదిన్నెపల్లె ఎస్టీ కాలనీ ప్రజలు 2008 నుండి వివిధ రకాల పంటలు వేస్తున్నారని 2023 వ సంవత్సరం నుండి అప్పుడు వైసీపీలో ఉన్న బొగ్గుల దుగ్గిరెడ్డి బసిరెడ్డి రమణారెడ్డిలు ఎస్టీలను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఈ విషయం పలుమార్లు స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశారని వారు గుర్తు చేశారు, ప్రస్తుతం వారిద్దరు అధికార పార్టీలోకొనసాగుతున్నారని దీని అడ్డుపెట్టుకొని ఎస్టీల మీదజులుం చేస్తున్నారని వారు ఆరోపించారు గత నెల 27వ తేదీన స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ర్ కాలనీ వాసుల వివరాలన్నీ అందజేశామని

భూసర్వే లో పేరు నమోదు చేసి ఆన్లైన్ చేస్తామని హామీ ఇచ్చిన తహసిల్దార్ గారు నేడు అధికార పార్టీ నాయకులు చెప్పగానే పనులు ఆపాలని క్రింది స్థాయి అధికారులను పంపించడం ఎంత వరకు న్యాయమన్నారు,18 సంవత్సరాల క్రితం అప్పటి అధికారులు పట్టాల పంపిణి చేసి భూములకు హద్దులు చూపించారని ఆ భూముల్లోనే ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని ఒకసారి తాసిల్దార్ వారు భూమి మీదకు వస్తే వారికి అర్థమవుతుందన్నారు పక్కనే సోలార్ పరిశ్రమ ఏర్పడటంతో అధికారం ఉందన్నధీమాతో ఈ మధ్యకాలంలోనే నాలుగు సార్లు అధికారులద్వార ఒత్తిడి తెచ్చి పనులు అపారని ఈ భూములన్ని ప్రక్కనే ఉన్న సోలార్ పరిశ్రమకు అప్పజెప్పాలని కుట్ర పన్నుతున్నారని వారు ఆరోపించారు,

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు హరి ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ నాయకులు అజయ్ కుమార్ లింగాల దిన్నెపల్లె అసైన్మెంట్ రక్షణ కమిటీ నాయకులు రామాంజనేయులు,కృష్ణ, రఘు లబ్ధిదారులు పాల్గొన్నారు

# సరికొత్తగా హస్త కళలు

(మొదటి పేజీ తరువాయి)

హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ. 1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ. 1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా



క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు–శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు–శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200 మందికి శిక్షణతో పాటు పనిముట్లు :** గురు–శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు–చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు–వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవుడ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేడ్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం :** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, మెరుగైన శిక్షణ, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా హస్తకళాకారులకు ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా ఉండేలా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. త్వరలోనే ఈ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నామని మంత్రి సవిత తెలిపారు.

## ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు, ఐఏఎస్ పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు.

కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27-07-2020న ఎస్.ఓ. 245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.ఓ. 245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రూ.3 కోట్లతో నిడదవోలు పట్టణంలోని ఎస్సీ కాలనీల్లో 17 అభివృద్ధి పనులు: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** నిడదవోలు పట్టణంలో దళిత వర్గాల సంక్షేమానికి, ఎస్సీ కాలనీల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోని 17, 20 వార్డుల్లో దాదాపు రూ. 90 లక్షల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో చేపట్టిన 4 ప్రధాన అభివృద్ధి పనులకు మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**రూ.90 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన :** మున్సిపల్ స్థలాన్ని ఆక్రమణల నుండి కాపాడి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే 'మోడల్ పార్క్'గా తీర్చిదిద్దేందుకు 17వ వార్డులోని సుబ్బరాజుపేటలో రూ. 30 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం అదే వార్డులోని శెట్టివారి వీధి, మరపట్లవారి వీధిలో బశిథిలావస్థకు చేరిన పాత డ్రెయిన్ల స్థానంలో మురుగునీటి పారుదల సాఫీగా జరిగేలా రూ. 17 లక్షలతో 545 మీటర్ల పొడవైన నూతన సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత 20వ వార్డు టీచర్స్ కాలనీలోని సెయింట్ ఆన్స్ రోడ్డు 3వ క్రాస్ రోడ్డులో స్థానిక నివాసితులకు దశాబ్దాల మట్టి రోడ్డు ఇబ్బందులను తొలగిస్తూ రూ. 19.50 లక్షల వ్యయంతో 160 మీటర్ల పొడవైన నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చివరగా 20వ వార్డులోని ఎం.వి. నగర్ లో ఖాళీగా ఉన్న మున్సిపల్ కమ్యూనిటీ హాల్ స్థలం చుట్టూ ఆక్రమణలను నిరోధించి, భవిష్యత్తులో పార్కుగా అభివృద్ధి చేసేందుకు రూ. 23.15 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

**రూ.3 కోట్లతో దళితవాడల్లో 17 అభివృద్ధి పనులు :** శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. నిడదవోలు నియోజకవర్గంలోని దళితవాడలను అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంచేందుకు రూ. 3 కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధుతో మొత్తంగా 17 అభివృద్ధి పనులను చేపడుతున్నామని వెల్లడించారు. ఈ నిధుల ద్వారా 8, 13, 17, 28 వార్డుల్లో కొత్త సీసీ డ్రెయిన్ల నిర్మాణం,8, 20, 23 వార్డుల్లో 5 నూతన సీసీ రోడ్ల





నిర్మాణం, 12, 13, 17, 23 వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల అనుసంధాన అభివృద్ధి, 17, 20 వార్డుల్లో మున్సిపల్ స్థలాల రక్షణకు ప్రహరీ నిర్మాణాలు, 8వ వార్డు పరిధిలోని చర్చిపేటలో అధునాతన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. స్థానిక దళిత వర్గాల విజ్ఞప్తి మేరకు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మరింత ప్రయోజనకరంగా మార్చేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. అక్కడ సచివాలయం, వాణిజ్య కాంప్లెక్స్ (షాపులు) నిర్మించి ఆదాయ వనరుగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే, స్థానిక స్మశాన వాటిక స్థల కొరతపై వచ్చిన వినతులకు స్పందిస్తూ.. ఇప్పటికే ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, సంబంధిత స్థల యజమానితో మాట్లాడి అతనికి వేరే చోట స్థలం కేటాయించి, త్వరలోనే స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

**నిడదవోలు పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా రూ.10 కోట్ల ప్రతిపాదనలు :** చిన్న పట్టణంగా ఉన్న నిడదవోలును అన్ని వసతులతో కూడిన మోడల్ టౌన్‌గా మార్చాలని ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో భాగంగా మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. దీనిపై మంత్రి నారాయణ తక్షణమే సానుకూలంగా స్పందించి, రూ. 10 కోట్లతో సమగ్ర ప్రతిపాదనలు పంపాలని ఈఎన్సీకి, అక్కడ నుండి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. దళిత, గిరిజన, బీసీ ప్రాంతాల సమగ్ర వికాసానికి ఒక మంత్రిగా తన శాయశక్తులా అత్యున్నత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి నిధుల విడుదలకు పూర్తి స్థాయిలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణలకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పర్యటనలో భాగంగా మంత్రి దుర్గేష్ కి ఆయా వార్డుల మహిళలు పూలవర్షం కురిపించి, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రారంభించిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను మంత్రి దుర్గేష్ ఆదేశించారు.

అంతకుముందు స్థానిక వార్డులోని డా. బి. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

# రైతు సమస్యలపై రైతు వేదిక వద్ద నిరసన..

## - డప్పు కొడుతూ నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



**యాదాద్రి భువనగిరి సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని ఆరోపిస్తూ , భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామ రైతువేదిక వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమానికి కూనూరు, ముస్త్యాలపల్లి , కేసారం , బాలంపల్లి గ్రామాలకు చెందిన రైతులు , మహి ళలు , యువకులు పెద్ద సంఖ్యలో హాజ రయ్యారు. రైతులకు ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని , రైతుల సమస్యలను పరిష్క రించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్య క్రమంలో చందుపట్ల పిఎసిఎస్ మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి , భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్ గౌడ్ , కేసారం సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్య కర్తలు పలు గ్రామల రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని , రైతుల పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని , రైతుల సమస్యలను పరిష్క రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం , రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని నాయ కులు స్పష్టం చేశారు.

# పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ..

## - ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య



**సూర్యాపేట, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అన్నారు. గురువారం చివ్వెంల మండలంలోని తుల్జారావు పేట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్ గారితో కలిసి కీత లావణ్య-వీరయ్య ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.... అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మరి ఎన్నో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనుందన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సంక్షేమం దిశగా పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాయకులు పత్తిపాక వేణుధర్, గ్రామ శాఖ అధ్యక్షుడు పత్తిపాక వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ మురారి, గ్రామ కాంగ్రెస్ నాయకులు పత్తిపాక రంగనాయకులు బానోతు బాలాజీ, దారావత్ మోహన్ బాబు, వార్డు సభ్యులు గుగులోతు చిలకమ్మా, గుగులోతు రామ్మూర్తి, గుగులోతు రజిత, పత్తిపాక రఘురాం, దారావత్ రాక్లి, భూక్యా శివరామకృష్ణ, పత్తిపాక రాధాకృష్ణ, పత్తిపాక భిక్షమయ్య, బానోతు సైదులు, గుగులోతు సైదులు, గుగులోతు మోతిలాల్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగు నాయక్, పడిదల రవి, గుంటూరు చిట్టిబాబు, దుబ్బాక ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా..

## - నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలి

## బీసు చందర్ గౌడ్ డిమాండ్..



**ఆత్మకూరు (ఎం) సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో నాణ్యత లేకపోవడంతో మోటార్లు కాలిపోతూ రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఒకవైపు ఎల్నినో ప్రభావం మరోవైపు నాణ్యత లేని విద్యుత్ సరఫరాతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాణ్యమైన విద్యుత్ అందించాలని, లేనిపక్షంలో నిరసనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, పట్టణ మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు యాస ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్, మామిడి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు కోరె భిక్షపతి, లగ్గాని రమేష్, బూడిద రాములు, కోల సత్తయ్య గౌడ్, మండల నాయకులు గడ్డం దశరథ గౌడ్, కాలె మల్లేష్, పుట్ట నర్సిరెడ్డి, యాస అంజిరెడ్డి, సోమరాజు, నాతి రాజు, నాతి స్వామి, గజ్జెల్లి శంకర్, కావటి స్వామి, నాగుల రాజు, చిక్కిరి రవి, యాట మధు, లోడి మధు యువజన విద్యార్థి నాయకులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదాద్రిలో ప్రత్యేక పూజలు..

## - వేడుకలకు ఏర్పాట్లు..- 6వ తేదీ శిఖ్యోత్సవం..

## - నేడు వైభవంగా స్వామివారి కృష్ణాష్టమి వేడుకలు



**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 04(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో, అనుబంధ ఆలయమైన పాత గుట్ట ఆలయంలో స్వామివారి తిరు నక్షత్ర ఉత్సవములను అత్యంత వైభవంగా నిర్వ హించుటకు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున శ్రీ స్వామివారి తిరు నక్షత్ర ఉత్సవ ములను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు కన్నన్ పెరుమాళ్ వారి, శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఉత్సవ మూర్తులకు నవ కళాశ స్నపన విశేష తిరుమంజున సేవా కైంకర్యము నిర్వహించబడును. 6వ తేదీ ఆదివారం సాయంత్రం 5:00 గంటలకు ఆలయ ప్రాంగణంలో శిఖ్యోత్సవము (ఉట్లు కొట్టుట) కార్యక్రమం నిర్వహించబడునని ఆలయ ఈవో భవాని శంకర్ తెలిపారు. నాలుగవ తేదీ కృష్ణాష్టమి సందర్భంగా భక్తులచే జరిపించు నిత్య/ శాశ్వత కళ్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీ సుదర్శన నారసింహ హోమం, భోగములు రద్దు చేయబడినవని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

# బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా ఉగ్గె నరేష్ ఎన్నిక..

## - ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షుడు



**ఆత్మకూరు (ఎం) సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆత్మకూర్ పట్టణ నూతన బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉగ్గె నరేష్ గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ ప్రభుత్వ విప్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య నివాసంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఉగ్గె నరేష్‌కు బీర్ల అయిలయ్య శుభాకాంక్షలు తెలిపారు. తనను అభినందించిన బీర్ల అయిలయ్యకు ఉగ్గె నరేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వెయ్యి రోజుల ప్రజా పాలన... సంక్షేమంలో జోరు, అభివృద్ధిలో దూకుడు

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో సంబరాలు..
- యాదగిరిగుట్టలో ఘనంగా 1000 రోజుల ప్రజా పాలన వేడుకలు..
- ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..
- వెల్లడించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య..




**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా పాలన సంబరాలను ఘనంగా నిర్వహించారు. యాదాద్రి జిలా డీసీసీ అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నాయకత్వంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్ల నిధులు తీసుకువచ్చి రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆలేరును రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు,యువత, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కేటీఆర్ రైతు మహా ధర్నాకు వ్యతిరేకంగా మిర్యాలగూడలో భారీ నిరసన ర్యాలీ

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ 1000 రోజుల ప్రజా పాలన సంక్షేమాన్ని చాటుతూ ప్రదర్శన



**మిర్యాలగూడ, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తున్న రైతు మహా ధర్నాకు వ్యతిరేకంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహిం చారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని వేలాది మంది కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, రైతులు పాల్గొన్నారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు ప్లేకార్డులు ప్రదర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రైతుల కోసం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ నినాదాలు చేశారు. అదే సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల కు జరిగిన అన్యాయాలు, రైతు సమస్యల పట్ల నిర్లక్ష్యం, పాలనా



వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోకుండా, రైతులకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైన కేటీఆర్.. ఇప్పుడు రైతుల సమస్యలపై మహా ధర్నా పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తోందని బి ఎల్ ఆర్ తెలిపారు. రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను ప్రజలు మరచిపోలేదని, రైతుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందో కేటీఆర్ ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత విస్తృతంగా వివరించి, ప్రతిపక్షాల బూటకపు రాజకీయాలను ప్రజల్లో ఎండగడతామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ భారీ నిరసన ర్యాలీలో మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ధీరావత్ స్కైలాబ్ నాయక్, నూకల వేణుగోపాల్ రెడ్డి,, గాయం ఉపేందర్ రెడ్డి, గుడిపాటి నవీన్, వన్ టౌన్, టూ టౌన్ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, ఈయాజ్, వివిధ మండలాల అధ్యక్షులు గుండు నరేందర్ గౌడ్, రేగట్టి రవీందర్ రెడ్డి, నాగు నాయక్, బాలు నాయక్, బెజ్జం సాయి, శంకర్ రెడ్డి, జిందా, కౌన్సిలర్లు, సర్పంచులు , కార్యకర్తలు, యువత, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల నిరసన కార్యక్రమం



**వలిగొండ, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 1000 రోజులు పూర్తి అయినా కానీ ఎలాంటి సంక్షేమ పథకాలుప్రజలకు అమలు చేయలేదు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు జరిగే నిరసన కార్యక్రమంలో రెండవ రోజైన మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల నిరసన కార్యక్రమానికి పైళ్ళ శేఖర్ రెడ్డి భువనగిరి మాజీ శాసనసభ్యులు,కంచర్ల రామకృష్ణారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు కోసం 13 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,అయినా రోడ్డు పనులు జరగడం లేదన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తన సొంత గ్రామంలో అభివృద్ధి చేయకపోతే నియోజవర్గంలో ఏమి అభివృద్ధి చేస్తాడని ఎద్దేవా చేశారు.భువనగిరి నియోజకవర్గంలో యే గ్రామానికి వెళ్లి చూసినా నేను చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నాయి.కానీ మీరు చేసిన పనులేందో చెప్పాలని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డికి సవాల్ విసిరారు.కెసిఆర్ పాలనలో రైతులకు రైతుబంధు,రైతు బీమా,24గంటల ఉచిత కరెంటు, సకాలంలో ఎరువులు, గ్రామాలలోనే వడ్లు కొనుగోలు కేంద్రాలు,తదితర అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యి,రైతులు కెసిఆర్ 10 ఏళ్ల పాలనలో రైతుల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు,రైతు భీమా,వడ్లకు 500 బోనస్ ఎగ్గొట్టారు,రుణమాఫీ అందరికి అమలు కాలేదు.కరెంటు ఇచ్చే 12 గంటలలో 10 సార్ల కరెంటు పోయి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులను పట్టించుకోవడం లేదు.కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంలో నీళ్లు ఉన్నా,ఇవ్వలేక కరువు తెచ్చారు.రైతులను హరి గోసలు పెడుతున్నారు.తక్షణమే రైతులకు రావాల్సిన సంక్షేమ పథకాలు, నాణ్యమైన 24 గంటల కరెంటు సప్లై కుంభం అనిల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎలిమినేటి సందీప్ రెడ్డి మాజీ జడ్పీ చైర్మన్,చింతల వెంకటేశ్వర రెడ్డి రాష్ట్ర నాయకులు, పైళ్ల రాజా వర్ధన్ రెడ్డి, వంగాల వెంకన్న గౌడ్, మాజీ జెడ్పిటిసిమొగుళ్ళ శ్రీనివాస్ సింగల్ విండో చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, ముద్ద సానికిరణ్ రెడ్డి మాజీ ఎంపీటీసీ పల్సశీ రమేష్, మాజీ మండల అధ్యక్షుడు దేగల పాండు,పట్టణ అధ్యక్షుడు ఎండి అప్రోజ్, ఉద్యమకారుడు పోలేపాక సత్యనారాయణ, సర్పంచ్ బొడిగే లింగస్వామి, మోటే జంగమ్మ లింగస్వామి, మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి కృష్ణ వార్డ్ నెంబర్ బలుగూరి నరేష్ రెడ్డి , మాడుగుల స్వర్ణలత, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ ,నాయకులు పల్చం రాజు, ఐటీపాముల ప్రభాకర్, కూచిమల్ల నాగేష్ ,కాశమల్ల శేఖర్, కలుకూరి రాములు మల్లశీ నరేష్ ,కూచిమల్ల భగవంతు, కొండూరు వెంకటేశం, సాంబ, చేవ్వ వెంకటేశం, సర్పంచులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపిటిసిలు మాజీ వార్డ్ నెంబర్లు వార్డ్ నెంబర్లు రైతులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

## - ఆత్మ కమిటీలు రైతులకు వారధిగా పనిచేయాలి..

## - ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, డైరెక్టర్లను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా సన్మానించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారంలో ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి అర్హుడైన రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ సేవలు అందేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. చైర్మన్ ఎనగండ్ల సుధాకర్‌తో పాటు నూతన డైరెక్టర్లకు అభినందనలు తెలిపి, రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు,కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేద కుటుంబానికి ఉన్న ఏకైక కళ సొంత ఇల్లు నిర్మాణం

## - అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు..

## - ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,

## - జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య



**సూర్యాపేట, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యలు అన్నారు. గురువారం సూర్యాపేట మండలంలోని రామచంద్రపురం, రాజునాయక్ తండా గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి కలిసి వీర్ల మౌనిక- రామచంద్రా రెడ్డి గారు, భూపతి ఉపేంద్ర - సైదులు, భూక్యా దేవి-వెంకన్న ల ఇందిరమ్మ ఇల్లుల గృహప్రవేశం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన గృహంలో గృహప్రవేశం చేస్తున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి లక్ష్మాధి, మండల ఇంచార్జ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, సర్పంచ్ గోదదాటి కావ్య సతీష్, ఉప సర్పంచ్ లింగయ్య, మాజీ సర్పంచులు మాలి కవిత అనంత రెడ్డి, మండల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, బొడ్డు మల్లయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతల అంజయ్య, మాజీ ఎంపిటిసి బండి ప్రభాకర్ రెడ్డి, నాయకులు నల్లగంటి నర్సయ్య, కొప్పుల లక్ష్మారెడ్డి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు దారావత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగు నాయక్, పడిదల రవి, గుంటూరు చిట్టిబాబు, దుబ్బాక ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి

## తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్

**రామ్‌మందిర్ ఏరియా, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యమకారులు ఎన్నో లాఠీ దెబ్బలు తిన్నారని, పోలీస్ కేసులు ఎదుర్కొని, తమ జీవితాలను సైతం త్యాగం చేశారని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు బస్ పాస్‌లు, 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, నెలకు రూ.25 వేల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా వాటిని అమలు చేయలేదని ఆరోపించారు.

ఉద్యమకారుల హామీల అమలుపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన కేకే కమిటీ సైతం ఇప్పటివరకు తమ కార్యాచరణను వెల్లడించలేదన్నారు. ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

అలాగే తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో ఈ నెల 6న ఎన్టీపీసీలో నిర్వహించనున్న సమావేశానికి సమితి సభ్యులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నగునూరి రాజయ్య గౌడ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనుముల కళావతి, జిల్లా అధ్యక్షుడు కత్తెరమళ్ళ




రమేష్, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి నూతి తిరుపతి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పర్స స్వాతి, రాష్ట్ర కార్యదర్శి తోడేటి స్వరూప, జిల్లా అధ్యక్షురాలు జె. శాంత, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల నారాయణ, జిల్లా కార్యదర్శులు కే. సీత, పల్లికొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఓటు కీలకం

## - ఎంపిడిఓ శివ మల్లేశ్వరప్ప



**సిరివెళ్ల, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఓటు కీలకమని ప్రతి ఒక్కరు తప్పకుండ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపిడిఓ శివమల్లేశ్వరప్ప అన్నారు గురువారం సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో, కామినేని పల్లె గ్రామాలలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప గ్రామ సభలను , ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణ సమావేశము నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి, దేశ భవిష్యత్తును నిర్ణయించడానికి ఓటు హక్కు అత్యంత కీలకం, గ్రామ అభివృద్ధి లో సరి అయిన నాయకుల ఎన్నుకోవడానికి ఓటు హక్కు చాలా ముఖ్యమైనదని, సరైన మరియు సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే శక్తి పౌరులకు ఓటు ద్వారా లభిస్తుంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి లో మార్పులు రావాలన్నా, మెరుగైన పాలన అందాలన్నా ఒక్కో ఓటు కుడా లెక్కలోకి వస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీల ఓటర్ల జాబితాలో తప్పులు (కులం, వయస్సు , చిరునామా) ఏమైనా వుంటే సరి చేసుకోవడానికి నేడే చివరి అవకాశము వున్నదని తెలిపారు. కోటపాడు గ్రామ పంచాయతీ కి2263 ఓటర్లు వుండగా అన్ని కుడా ఎటువంటి తప్పులు లేకుండా వున్నాయన్నారు. కామినేని పల్లె గ్రామంలో 1175 ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా.. లయన్స్ క్లబ్ కంటి శిబిరం

## -122 మందికి కంటి పరీక్షలు.. 43 మందికి ఆపరేషన్లు

**రాయికల్, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని క్లబ్ అధ్యక్షుడు వాసం ప్రసాద్ అన్నారు. గురువారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 122 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 43 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని వైద్యుల పర్యవేక్షణలో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వాసం ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 3,579 మందికి కంటి ఆపరేషన్లు చేయించడంతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో చైర్మన్ లయన్ తంగేళ్ల రమేష్ మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం




చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి సుధవేణి మురళి, చార్టర్డ్ ప్రెసిడెంట్ మోర హన్మాండ్లు, టెక్నీషియన్ ప్రభాకర్, క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కుర్మ సుదర్శన్ రెడ్డి, కట్ల నర్సయ్య, సత్యనారాయణ, పారిపెల్లి శివప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, గ్రామీణ వైద్యులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహదేవపురం గ్రామంలో ఇంటింటికీ టీడీపీ - జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మెట్ల భాస్కర్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం



**సిరివెళ్ల, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండల పరిధిలోని మహదేవపురం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం బుధవారం జోరుగా సాగింది. నంద్యాల జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు టీడీపీ సీనియర్ నాయకులు మెట్ల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్ల భాస్కర్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూలై 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడ జరిగిందన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా విని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలకు, ప్రస్తుత కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధికి ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఆశీర్వదించి, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు వైద్య శిబిరం -ప్రారంభించిన సైబరాబాద్ సీపీ రమేష్





**సైబరాబాద్, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

నిరంతరం వాయు కాలుష్యం, దుమ్ము బారిన పడుతూ ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణ కోసం సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), యశోద ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో పల్మనరీ, వాస్కులర్ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఎస్‌సీఎస్‌సీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించగా.. సిబ్బందికి పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పీఎఫ్‌టీ), ఫెనో, సిక్స్-మినిట్ వాక్ టెస్ట్, వాస్కులర్ తదితర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ.. కఠిన పరిస్థితుల్లో పని చేసే ట్రాఫిక్ పోలీసులు తప్పనిసరిగా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ముందుస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ శారీరక శ్రమ, యోగా, శ్వాస వ్యాయామాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ నాగరాజు రెడ్డి, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు నవేద్ ఆలం ఖాన్, భాను మూర్తి, యశోద ఆస్పత్రి ప్రతినిధులు మేఘా చిట్కారా, ప్రదీప్, సోమ శేఖర్, వైద్యులు వెంకట్ రమణ కొల్లా, గోపి ఏడ్లపాటి, శ్రీకాంత్ రాజు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా సి ఎస్ ఆర్ 2.0 నిలవాలి

## : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**నల్లచెరువు, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

కదిరి: సీనియర్ జర్నలిస్ట్‌గా జర్నలిజం రంగంలో విశేష సేవలందించిన శ్రీనివాస్ రెడ్డి నూతనంగా స్థాపించిన సి ఎస్ ఆర్ 2.0 యూట్యూబ్ మీడియా ఛానల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కదిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ హాజరై రిబ్బన్ కట్ చేసి సి ఎస్ ఆర్ 2.0 యూట్యూబ్ మీడియా ఛానల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఛానల్ లోగోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ... ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అన్నారు. జర్నలిజం రంగంలో తనకున్న అనుభవంతో శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించిన సి ఎస్ ఆర్ 2.0 మీడియా ఛానల్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు ప్రజలకు సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా, వాస్తవాలను ప్రజలకు అందిస్తూ సి ఎస్ ఆర్ 2.0 మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం సి ఎస్ ఆర్ 2.0 యాజమాన్యానికి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రెడ్డి కి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఛానల్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# గ్రీన్ టెక్నాలజీతో పరిశ్రమలకు భారీ ప్రయోజనాలు





- సౌర విద్యుత్‌తో వ్యయ నియంత్రణ
- రిచ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ గురు చరణ్
- ఇంధన పొదుపు,సౌర విద్యుత్ తో పోటీతత్వం పెంపు
- ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్

**ములుగు, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

హరిత సాంకేతికతలను స్వీకరించడం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు) ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవడంతో పాటు పోటీతత్వాన్ని పెంచుకోవచ్చని రిచ్ ప్రాజెక్ట్ మేనేజర్‌సస్టైనబిలిటీ గురు చరణ్ ఉప్పరపల్లి అన్నారు. ములుగు రైస్ మిల్ అసోసియేషన్ సహకారంతో రిచ్ ఆధ్వర్యంలో 'రాంప్‌గ్రీనింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ' కార్యక్రమంపై అవగాహన సదస్సు ములుగులో నిర్వహించారు.ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ ఇంధన సామర్థ్యం, వనరుల పొదుపు, సౌర విద్యుత్ వంటి హరిత సాంకేతికతలను పరిశ్రమలు అందిపుచ్చుకోవాలని సూచించారు. 'గోయింగ్ గ్రీన్'తో పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యాపార స్థిరత్వం, భవిష్యత్ పోటీతత్వం సాధ్యమవుతుందని తెలిపారు.ములుగు రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు ఇంధన పొదుపు చర్యలు చేపట్టి సౌర విద్యుత్ వంటి హరిత సాంకేతికతలను వినియోగించుకోవాలని సూచించారు. నిర్వహణ వ్యయాలను తగ్గించుకుని స్థిరమైన అభివృద్ధి సాధించవచ్చన్నారు.ములుగు డీఐసీ జనరల్ మేనేజర్ ఏ. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలు రాంప్‌గ్రీనింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో పాటు స్థిరమైన సాంకేతికతలను అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో రైస్ మిల్ పరిశ్రమల ప్రతినిధులు, ఎంఎస్‌ఎంఈ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# వైష్ణవి విద్యానికేతన్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**నిర్మల్‌జిల్లా, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

వైష్ణవి విద్యానికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలరించారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం విద్యార్థులకు ఎన్నో విలువైన సందేశాలను అందిస్తుందని తెలిపారు. ధర్మాన్ని కాపాడటం, మంచి మార్గంలో నడవడం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం వంటి లక్షణాలను శ్రీకృష్ణుడి జీవితం నుంచి నేర్చుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ సాయినాథ్ మాట్లాడుతూ పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం చిన్నారుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఇంటర్ జోనల్ బాక్సింగ్ పోటీలను ప్రారంభించిన డాక్టర్ మధుసూదనరావు

## జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల, సెప్టెంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) :**

నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మధుమణి ఆసుపత్రి ఆడిటోరియంలో ఇంటర్ జోనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి ఫయాజ్ నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అమరావతి క్రీడా పోటీలలో బాక్సింగ్ లో జిల్లా క్రీడాకారులు ఒక బంగారు పతకం, నాలుగు రజత పతకాలు సాధించి , విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల తర్వాత తృతీయ స్థానంలో నిలవడం నంద్యాలకు గర్వకారణం అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో క్రీడలకు విశేష ప్రోత్సాహం అందిస్తున్నందుకు క్రీడా సంఘాల తరపున డాక్టర్ రవి కృష్ణ ధన్యవాదాలు తెలిపారు. నంద్యాలలో బాక్సింగ్ శిక్షణ శిబిరాలు, రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు.డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడాకారులు మహమ్మద్ అలీ, మేరీ కోమ్ లాంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని




నిరంతర సాధన ద్వారా ఉన్నత స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ ఆడిటోరియం క్రీడలకు కూడా వినియోగిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. నంద్యాల జిల్లా బాక్సింగ్ కార్యదర్శి ఫయాజ్ మాట్లాడుతూ ఈ పోటీలలో కర్నూలు,నంద్యాల, అన్నమయ్య మూడు జిల్లాల నుండి 150 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని, బాలురకు, బాలికలకు వేరువేరుగా వివిధ వెయిట్ కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్ తో పాటు, నంద్యాల పట్టణ కార్యదర్శి నూర్ భాషా, కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, అహోబిలం జడ్పీ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, అన్నమయ్య జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఆనంద్ , బాక్సింగ్ కోచ్ లు, రెఫరీలు ఉపేంద్ర, గణేష్, చంద్ర, జస్వంత్, పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఒక్క చుక్క రక్తం. ఒక నిండు ప్రాణం..!



○ రక్తదాతలకు సినీ నటుడు శ్రీకాంత్ అభినందన

**కడప(జర్నలిస్ట్ ఫైల్)** రక్తదానం మానవత్వానికి ప్రతీక అని, మహాపుణ్య కార్యమని ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలు నిజమైన హీరోలని కొనియాడారు.

కడప నగరంలోని పీఆర్ఆర్ఎం ఫార్మసీ కళాశాలలో ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రొద్దుటూరుకు చెందిన తెలుగు సినీ నిర్మాత కె. రామకృష్ణ గౌరవ అధ్యక్షుడిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసి అత్యవసర సమయాల్లో ఎంతోమందికి రక్తాన్ని అందిస్తూ సేవలందిస్తున్న కడప సమాచార పౌర సంబంధాల శాఖలో ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న పిఎండి సోహైల్ అలీ ఖాన్ ను సినీ నటుడు శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను అభినందిస్తూ జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఒక వ్యక్తి చేసే రక్తదానం మరో వ్యక్తి ప్రాణాలను కాపాడే అమూల్యమైన సేవ అని అన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని సరైన సమయంలో రక్తం అందకపోతే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి సమయంలో రక్తదాతలు అందించే రక్తం ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేం. ఒక మనిషి మరో మనిషికి ఇవ్వగలిగే అత్యంత విలువైన కానుక రక్తం. మనం చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టగలదు. అందుకే ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానానికి ముందుకు రావాలి" అని శ్రీకాంత్ పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడిగా హాజరైన సినీ నిర్మాత కె. రామకృష్ణ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. సమాజంలో రక్తదానంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదాతలు, సామాజిక సేవకులు, ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు, సినీ అభిమానులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. "రక్తదానం చేయండి. ప్రాణాలను కాపాడండి.. నిజమైన హీరోలుగా నిలవండి" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేత



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి పోలకంపాడుకు చెందిన చిరు వ్యాపారి షేక్ షఫియాకు మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనలాంటి చిరు వ్యాపారులకు చేయూతనిస్తూ ఉపాధి కల్పిస్తున్న మంత్రి నారా లోకేష్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి–తాడేపల్లి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ డైరెక్టర్ గుద్దంటి నాగేశ్వరావు, షేక్ అమీర్, జోరిగే నాగసురేష్, నీలం నాగలక్ష్మి, కాకర్ల సాంబశివరావు, లంకే సూర్యం, ధనుంజయ్, హరికృష్ణ, షేక్ రహీమ్, కళ్యాణ్, ఇట్టా శుభాకర్, షేక్ కరీముల్లా, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమగంపల్లె వద్ద విషాదం..
## కారు ఢీకొని 9వ తరగతి విద్యార్థి మృతి

**కడప(జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా కాశినాయన మండలం అమగంపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇటుకలపాడు గ్రామానికి చెందిన కొప్పోలు శ్రీనివాస్ రెడ్డి, లత దంపతుల రెండో కుమారుడు సురేంద్ర రెడ్డి (14) మృతి చెందాడు.

సురేంద్ర రెడ్డి తన గ్రామానికి బైక్‌పై వెళుతూ అమగంపల్లె మెయిన్ రోడ్డు నుంచి ఇటుకలపాడు రోడ్డుకు క్రాస్ అవుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు 9వ తరగతి చదువుతున్నాడు.

ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు తెలుస్తోంది. పిన్న వయసులోనే కుమారుడిని కోల్పోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న కాశినాయన మండలం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# త్వరలో అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే నసీర్

○ సచివాలయాల్లో అర్జీల స్వీకరణ

○ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

○ ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటాం

○ ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామని, ప్రతి ఒక్కరూ సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. కూటమి నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని, కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

**కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ :** కృష్ణుడి జీవితం ప్రతి మానవుడికి మార్గదర్శకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక పాత గుంటూరు లోని యాదవబజార్, మణి హోటల్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా నవ్వుతూ ఎదుర్కొనే ధైర్యం కృష్ణుడి బాల్యం నేర్పుతుందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి బోధించిన భగవద్గీత సమాజానికి సన్మార్గం చూపించదని చెప్పారు.

# కొత్త పింఛన్లు పారదర్శకంగా మంజూరు చేస్తాం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు తావు లేదు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పెన్షన్ మంజూరులో అర్హతే ప్రామాణికమని రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

ప్రస్తుతం ప్రజా గ్రీవెన్స్‌లో కొత్త పింఛన్ల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హుల పేరుతో నిజమైన లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి తొలగించి, అధికార పార్టీకి చెందిన వారికి ప్రయోజనం చేకూరే విధంగా వ్యవహరించారని ఎమ్మెల్యే విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పక్షపాతం చోటుచేసుకోవడం వల్ల ఎంతో మంది అర్హులు నష్టపోయారని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మాత్రం సంక్షేమ పథకాల అమలులో "అర్హతే ప్రామాణికం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యాలకు తావు ఉండదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి పారదర్శకతతో పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ఒక్క లబ్ధిదారుడూ నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# ఏపీ స్టేట్ పోలీస్ క్రీడల్లో సత్తా చాటిన బాపట్ల టౌన్ సీఐ రాంబాబు

○ లాన్ టెన్నిస్ సింగిల్స్ ట్రోఫీ కైవసం

○ జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ చేతుల మీదుగా ఘన సత్కారం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీలలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. సెప్టెంబర్ 1 నుండి 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగిన ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రాంబాబు విశేష ప్రతిభ కనబరిచారు. లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీల్లో విజేతగా నిలిచి ప్రతిష్టాత్మక ట్రోఫీని కైవసం చేసుకున్నారు.

శుక్రవారం బాపట్ల జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సీఐ ఆర్. రాంబాబు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో విజయాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేసిన సీఐ రాంబాబును ఎస్పీ సాదరంగా అభినందించి, పతకంతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీలలో వివిధ జిల్లాల నుంచి ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి చెందిన సుమారు 20 మందికి పైగా అధికారులు లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో పోటీపడ్డారని తెలిపారు. వారందరినీ వెనక్కు నెట్టి బాపట్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ విజేతగా నిలవడం జిల్లా పోలీస్ శాఖకెంతో గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలోనూ పాల్గొని మరింతగా సత్తాచాటాలని ఆకాంక్షించారు.

నిత్యం ఒత్తిడితో కూడిన పోలీసు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణ ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌కు, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీపడి ట్రోఫీ సాధించిన సీఐ ఆర్. రాంబాబును బాపట్ల జిల్లా పోలీస్ అధికారులు మరియు తోటి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## రాష్ట్ర పోలీస్ క్రీడల్లో గుంటూరు పోలీసుల సత్తా




○ పలు విభాగాల్లో పతకాలు.. డాగ్ స్క్వాడ్ రన్నరప్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో గుంటూరు జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. సెప్టెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పోలీస్ యూనిట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా పోటీపడ్డారు.

ఫైరింగ్ విభాగంలో గుంటూరు ఎస్బీ సీఐ ఏ. మల్లికార్జునరావు స్టెన్‌గన్ ఈవెంట్‌లో రెండో స్థానం, కార్బైన్ ఈవెంట్‌లో మూడో స్థానం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ 85 కేజీల విభాగంలో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు స్వర్ణ పతకం సాధించారు.

కబడ్డీ విభాగంలో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఉమెన్ కానిస్టేబుల్ క్రాంతికుమారి, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఉమెన్ కానిస్టేబుల్ తిరుపతమ్మ గుంటూరు రేంజ్ తరపున పాల్గొని రెండో స్థానంలో నిలిచారు. హ్యాండ్ రైజింగ్ విభాగంలో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన కానిస్టేబుల్ కాంతికుమారి రజత పతకం సాధించారు.

డాగ్ స్క్వాడ్ విభాగంలో గుంటూరు రేంజ్ డాగ్ స్క్వాడ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. కే. వేణుబాబు ఆధ్వర్యంలోని గుంటూరు డాగ్ స్క్వాడ్‌కు చెందిన 'సింబా' నార్కోటిక్ టెస్ట్ విభాగంలో రెండో స్థానం సాధించింది.

క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తి, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

విధి నిర్వహణతో పాటు ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో హోరాహోరీగా సాగిన పోటీల్లో గుంటూరు జిల్లా పోలీస్ సిబ్బంది పలు పతకాలు సాధించడం పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## వినుకొండకు ఇక తాగునీటి దిగులు ఉండదు
## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



○ సాగర్ జలాలతో నిండుతున్న సింగర చెరువు..

○ క్షేత్రస్థాయిలో పరిశీలించిన జీవీ ఆంజనేయులు

○ సింగర చెరువుతోనే ఆగం.. నియోజకవర్గంలోని తాగునీటి చెరువులన్నీ నింపేలా చర్యలు

○ శాశ్వత తాగునీటి పథకం పనులపై నిరంతర పర్యవేక్షణ.. శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశం

**వినుకొండ, (జర్నలిస్ట్ ఫైల్ ):** వినుకొండ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సాగర్ జలాలతో నిండుతున్న సింగర చెరువును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుకు వస్తున్న నీటి ప్రవాహం, ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**ప్రతి ఇంటికీ ప్రతిరోజూ మంచినీరు అందించడమే లక్ష్యం**

"వినుకొండ ప్రజలకు ఇక తాగునీటి దిగులు ఉండకూడదన్నదే మా సంకల్పం. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న శాశ్వత తాగునీటి పథకాన్ని వేగంగా పూర్తి చేసి ప్రతి ఇంటికీ ప్రతిరోజూ సురక్షిత మంచినీరు అందిస్తాం" అని జీవీ స్పష్టం చేశారు. పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ పథకం పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, తాను కూడా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షిస్తున్నానని చెప్పారు.

**మంత్రి నిమ్మల రామానాయుడు తో మాట్లాడి సాగర్ జలాల విడుదలకు ప్రత్యేక చొరవ**

వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గిన పరిస్థితిని గుర్తించి ముందుగానే చర్యలు చేపట్టామని జీవీ తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా మాట్లాడి సాగర్ జలాలను విడుదల చేయించామని చెప్పారు. సింగర చెరువుతోనే సరిపెట్టకుండా నియోజకవర్గంలోని తాగునీటి అవసరమున్న చెరువులన్నింటికీ నీరు చేరేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలతో పాటు పశువుల తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బంది రాకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

"శాశ్వత తాగునీటి పథకం పూర్తయితే ఆరు నెలలకు ఒకసారి చెరువులను నింపుకుంటే చాలు. ఏడాది పొడవునా ప్రజలకు ప్రతిరోజూ మంచినీరు అందించే అవకాశం ఉంటుంది. ద

వినుకొండ ప్రజల ఎన్నో ఏళ్ల కల, ఆకాంక్ష ఈ పథకంతో సాకారం కానుంది" అని జీవీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ విడుదల

○ సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్.. సెప్టెంబర్ 27న ఫైనల్

○ ఫైనల్‌తో కలిపి మొత్తం 13 మ్యాచ్‌లు.. మంగళగిరి వేదికగా మరోసారి డే, నైట్ మ్యాచ్‌లు

○ డబ్ల్యూపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్

○ ప్రేక్షకులకు మరోసారి ఉచిత ప్రవేశం

○ లీగ్ ను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), సెక్రటరీ సానా సతీష్ బాబు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడ( ఏ సి ఏ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం)మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న డబ్ల్యూపీఎల్‌కు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌తో కలిపి మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెప్టెంబర్ 19న తొలి మ్యాచ్ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 27న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు ఫైనల్ మ్యాచ్కు ఏదైనా అంతరాయం కలిగితే ఒక రిజర్వ్ డ్ డే రోజున మ్యాచ్ నిర్వహిస్తారు. మంగళగిరి వేదికగా జరగనున్న ఈ పోటీల్లో డే, నైట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మహిళా క్రికెట్ అభిమానులు ప్రత్యక్షంగా మ్యాచ్‌లను వీక్షించేలా మరోసారి ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. గతంలో లీగ్‌కు లభించిన ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఈసారి కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్రీడాకారిణులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**నాలుగు జట్ల మధ్య పోటీ**

డబ్ల్యూపీఎల్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. ఈ జట్లు లీగ్ దశలో పరస్పరం తలపడుతూ తమ ప్రతిభను ప్రదర్శించనున్నాయి. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుని టైటిల్ కోసం పోటీపడనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌తో లీగ్ విజేత ఎవరో తేలనుంది.

**మిథాలీ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా**

భారత మాజీ కెప్టెన్, మహిళా క్రికెట్‌లో ప్రముఖ క్రీడాకారిణి మిథాలీ రాజ్ డబ్ల్యూపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. ఆమె అనుభవం, క్రికెట్ పట్ల ఉన్న అభిమానం, మహిళా క్రీడాకారిణులకు అందించిన ప్రేరణ లీగ్‌కు మరింత ప్రత్యేకతను తీసుకురానున్నాయి. మిథాలీ రాజ్ భాగస్వామ్యం ద్వారా మహిళా క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు నిర్వాహకులు కృషి చేయనున్నారు.

**ప్రత్యేక అతిథుల సమక్షంలో ప్రారంభోత్సవం**

డబ్ల్యూపీఎల్‌ను మరోసారి ఘనంగా ప్రారంభించేందుకు ప్రత్యేక అతిథులను ఆహ్వానించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రత్యేక అతిథుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

**విజయవంతం చేసేందుకు ఏసీఏ ఆధ్వర్యంలో సన్నాహాలు**

డబ్ల్యూపీఎల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), సెక్రటరీ సానా సతీష్, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ దొడ్డపనేని కళ్యాణ్ కృష్ణ ఆధ్వర్యంలో సన్నాహాలు కొనసాగుతున్నాయి. మ్యాచ్‌ల నిర్వహణ, క్రీడాకారిణులకు అవసరమైన సౌకర్యాలు, ప్రేక్షకుల కోసం ఏర్పాట్లు, లీగ్‌కు సంబంధించిన ఇతర అంశాలపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. మహిళా క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం అందించేలా పోటీలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

డబ్ల్యూపీఎల్ ద్వారా ప్రతిభావంతులైన మహిళా క్రీడాకారిణులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక లభించనుంది. లీగ్ విజయవంతం కావడానికి క్రీడాకారిణులు, జట్లు, నిర్వాహకులు, ప్రేక్షకులు సమష్టిగా సహకరించాలని ఏసీఏ ప్రతినిధులు కోరుతున్నారు. సెప్టెంబర్ 19న ప్రారంభమై, సెప్టెంబర్ 27న ఫైనల్‌తో ముగియనున్న డబ్ల్యూపీఎల్ పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## టెట్ సమస్యల పరిష్కారానికి యుటీఎఫ్ నిరాహార దీక్షలు



○ సీఐటీయూ సంపూర్ణ మద్దతు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) ఆధ్వర్యంలో ప్రారంభించిన నిరాహార దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సెప్టెంబర్ 4 నుంచి నిర్వహిస్తున్న నిరాహార దీక్షలను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు యుటీఎఫ్ నాయకులు, సభ్యులకు దండలు వేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(1)కు అవసరమైన సవరణలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షల్లో అర్హత నిబంధనలను సడలించాలని, ఉపాధ్యాయులు ప్రస్తుతం బోధిస్తున్న సబ్జెక్టుల్లోనే టెట్ పరీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల అభీష్టం మేరకు ప్రత్యేక టెట్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు.

జిల్లా, మండల స్థాయిల్లో యుటీఎఫ్ చేపట్టే అన్ని కార్యక్రమాలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహించే పోరాటాల్లో సీఐటీయూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్, వివిధ జిల్లాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ ఐటీ-రైట్‌బుక్ టెక్నాలజీస్ మధ్య అవగాహన ఒప్పందం



○ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమ అనుభవం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించేందుకు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రైట్‌బుక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం ద్వారా విద్యాసంస్థ–పరిశ్రమల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయనున్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ నాలెడ్జ్, పరిశ్రమ అనుభవంతో పాటు కెరీర్ అవకాశాలను అందించేందుకు ఇరు సంస్థలు సంయుక్తంగా పనిచేయనున్నాయి.

ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యాలు విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. ఈ వీశిఖ ద్వారా పరిశ్రమల అవసరాలను విద్యార్థులు అర్థం చేసుకుని, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

డీన్ ఆఫ్ అడ్మిషన్స్ డా. రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశ్రమ ఆధారిత శిక్షణ అందించడంలో ఈ ఒప్పందం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుని మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అనుసంధానం, ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రైట్‌బుక్ టెక్నాలజీస్‌తో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం విద్యార్థులకు మరిన్ని అవకాశాలను అందించేందుకు దోహదపడుతుందని అన్నారు.

కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, రైట్‌బుక్ టెక్నాలజీస్ హైదరాబాద్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు 29 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి



○ సీపీఎస్ రద్దుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి: ఏపీజీఈఎస్ఏ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శనివారం జరిగే సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై కీలక నిర్ణయాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోరారు. ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయాలు సుమారు 15 లక్షల కుటుంబాలపై ప్రభావం చూపుతాయని తెలిపారు.

గుంటూరు కలెక్టరేట్‌లో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో చాంద్ బాష మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచి 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, పీఆర్సీతో సంబంధం లేకుండా ఉద్యోగులకు 29 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. ఇప్పటికే ఉద్యోగులు మూడేళ్లుగా నష్టపోయారని, ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో నేరుగా 29 శాతం ఫిట్‌మెంట్ డిమాండ్‌ను బలంగా వినిపించాలని సూచించారు. సీపీఎస్ రద్దు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, పోలీసులకు పెండింగ్‌లో ఉన్న రెండు సరెండర్ లీవుల బకాయిలను వెంటనే చెల్లించాలని చాంద్ బాష కోరారు. పోలీసులకు పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను కూడా చెల్లించి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని ముఖ్యమంత్రిని కోరారు.

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే సమావేశంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని చాంద్ బాష తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సమావేశంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.


# నిడదవోలును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

○ మంత్రి కందుల దుర్గేష్

○ తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారు, నిడదవోలు పట్టణంలోని మదన గోపాలస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి దుర్గేష్

○ సాంప్రదాయ పంచకట్టులో దర్శనమిచ్చిన మంత్రి దుర్గేష్.. శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉత్సాహంగా గడిపిన మంత్రి దుర్గేష్..

○ నిడదవోలును నంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని వెల్లడి



**నిడదవోలు:** నిడదవోలును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శ్రావణ శుక్రవారం , శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని మంత్రి కందుల దుర్గేష్ తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయాన్ని, నిడదవోలు పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్ పూర్తి తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ పంచకట్టులో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులతో సరదాగా గడిపి ముచ్చటించారు. కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళా భక్తులను ఆప్యాయంగా పలకరించారు. అంతకుముందు ఆలయ అధికారులు, వేదపండితులు మంత్రికి ఘనస్వాగతం పలికి వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శాస్కి స్కీమ్ క్రింద అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ...పర్యాటక శాఖ మంత్రిగా వచ్చిన అవకాశంతో నిడదవోలు ప్రాంతాన్నిఅఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో అంతర్భాగం చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో భక్తుల కోసం రూపుదిద్దుకున్న వసతి సౌకర్యాల నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. చినకాశీరేవులో ఘాట్ల ఆధునికీకరణ, శెట్టిపేట గోదావరి కెనాల్ నందు బోటింగ్, వేసైడ్ రెస్టారెంట్, ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అమ్మవారి ఆశీస్సులతో నిడదవోలును రాష్ట్రంలోనే నంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు.

“భగవద్గీత ద్వారా మానవాళికి కర్తవ్యాన్ని, అమూల్యమైన జ్ఞానాన్ని అందించిన జగద్గురువు శ్రీకృష్ణుడు. ఊరూరా భక్తిశ్రద్ధలతో జరుపుకునే కృష్ణాష్టమి వేడుకలు సమాజంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతాయి. శ్రీకృష్ణుని దివ్య ఆశీస్సులతో, కోటసత్తెమ్మ అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు నిండాలని, రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించానని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ధర్మాన్ని రక్షించి, అధర్మాన్ని నశింపజేయడమే కృష్ణ తత్వమని, శ్రీకృష్ణ భగవానుడు చూపిన మార్గం సమాజానికి సర్వదా అనుసరణీయమని వివరిస్తూ రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణజన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్, కార్యనిర్వహణాధికారి (ఈవో), ఆలయ అర్చకులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి

○ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలకు ఏపీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 5న ఉద్యోగ సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాచర్ల బుజ్జి హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకుల కృషి వల్లే ఈ చర్చలకు అవకాశం లభించిందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించి, వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులకు మాచర్ల బుజ్జి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు, క్యాడర్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా గుర్తించి, వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్, కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని బుజ్జి కోరారు. సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తికి అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో 19 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం సుమారు రూ. 15 వేల వేతనం అందుతోందని, కొత్తగా చేరిన వారికి కూడా అదే స్థాయిలో వేతనం ఇస్తున్నారని తెలిపారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల సీనియారిటీని గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగ సంఘాల నాయకులను కోరారు.

62 ఏళ్లకు పదవీ విరమణ వయసు పెంపు కోరాలి

ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సుమారు లక్ష మంది ఉద్యోగులతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడంలో ఉద్యోగ సంఘాల నాయకుల కృషి ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల మేరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, అర్హులైన ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

తమతో కలిసి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా తమ సమస్యలుగానే భావించి, ముఖ్యమంత్రితో జరిగే చర్చల్లో వారి తరఫున బలంగా వాదించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులకు మాచర్ల బుజ్జి విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించడం శుభపరిణామం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులు సంఘాలకతీతంగా ఐక్యంగా మద్దతు తెలపడం వల్ల ప్రభుత్వం ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని చర్చలకు ఆహ్వానించడం శుభపరిణామమని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం తమ ఉద్యమానికి లభించిన తొలి విజయంగా భావిస్తున్నామని ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పి. లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

అయితే ఉద్యోగులు ప్రధానంగా కోరుకుంటున్నది ఆర్థిక ప్రయోజనాల పరిష్కారమేనని వారు స్పష్టం చేశారు. అతి తక్కువ కాలపరిమితితో పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిన నేపథ్యంలో మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడంతో పాటు రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు పింఛను పునరుద్ధరించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇంతవరకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ లేకుండా పనిచేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించాలని కోరారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించకుండా ఆర్టీసీ ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 22న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి తరఫున చర్చించిన ఇతర 30 డిమాండ్లను కూడా పరిష్కరించాలని కోరారు.

ఈ అంశాలపై శనివారం జరిగే చర్చలను ప్రభుత్వం సానుకూల వాతావరణంలో నిర్వహించి ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వం కోరింది. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగే చర్చల్లో ఉద్యోగుల న్యాయమైన ఆర్థిక డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఆర్థికపరమైన డిమాండ్లకు పరిష్కారం లభించి ఉద్యోగులకు న్యాయం జరిగినప్పుడే తమ ఉద్యమం విజయవంతమైందిగా భావిస్తామని స్పష్టం చేసింది.

**5న ‘డిమాండ్స్ డే’ నిరసనలు యథాతథం**

ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించినప్పటికీ ఇప్పటికే ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో ఎలాంటి మార్పు లేదని ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వం తెలిపింది. శనివారం 5వ తేదీన భోజన విరామ సమయంలో ‘డిమాండ్స్ డే’ నిరసన కార్యక్రమాలను యథాతథంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది. అన్ని జిల్లాల నాయకత్వం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చింది.

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు. వీటివల్ల చాలా ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో కనిపించనున్నాయి.

**రేడియోగ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు :** రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించ రాదని స్పష్టం చేసింది.

**నర్సులపై పని భారం తగ్గిస్తూ...:** నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా, మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్నాచీవీ సేవలను సమర్థంగా వినియోగించుకుని విధులు సర్దుబాటు చేయాలని సూచించారు. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు.

**ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కింద ప్రోత్సాహకాలు:** శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మలేరియా నిర్మూలనలో ఏపీ ఉత్తమ విధానాలకు జాతీయ నిపుణుల ప్రశంసలు

○ వ్యాధి నిఘా, కేసుల నిర్వహణలో రాష్ట్ర చర్యలకు అభినందనలు

○ గిరిజన ప్రాంతాల్లో డ్రోన్లు, ఫీడర్ అంబులెన్స్‌ల వినియోగంపై ప్రత్యేక ప్రశంసలు

○ ‘ఫ్రైడే-డ్రై డే’, ఎల్ఎల్ఐఎన్‌ల పంపిణీపై నిపుణుల సంతృప్తి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** మలేరియా నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న, సమగ్ర విధానాలను జాతీయ స్థాయి నిపుణుల బృందాలు ప్రశంసించాయి. వ్యాధి నిఘా, కేసుల ముందస్తు గుర్తింపు, చికిత్స, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణ, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ--ప్రైవేటు సమన్వయం వంటి అంశాల్లో రాష్ట్రం అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను నిపుణులు గుర్తించారు. సీఎం డ్యాష్‌బోర్డు, ‘అవేర్’ వ్యవస్థ, డ్రోన్ సాంకేతికత, ఫీడర్ అంబులెన్స్‌లు, ‘ఫ్రైడే--డ్రై డే’, ఐహెచ్ఐపీ, దీర్ఘకాలిక క్రిమిసంహారక దోమతెరల (ఎల్ఎల్ఐఎన్) పంపిణీని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

లినాలుగు రాష్ట్రాల్లో మలేరియా కార్యక్రమంపై సమీక్షలి

2027--2032 జాతీయ వ్యూహాత్మక ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో మలేరియా నియంత్రణ కార్యక్రమాలను జాతీయ స్థాయి నిపుణుల బృందాలు సమీక్షిస్తున్నాయి. ఇందులో భాగంగా సెప్టెంబరు 1 నుంచి శుక్రవారం వరకు ఏపీలో నిపుణుల బృందాలు పర్యటించాయి. మలేరియా ప్రభావిత అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు మలేరియా ప్రభావం తక్కువగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాయి. ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలు, కేసుల గుర్తింపు, చికిత్స, వ్యాధి నియంత్రణ చర్యలను పరిశీలించాయి.

**చక్రధర్‌బాబుతో సమీక్ష**

నాలుగు రోజుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కేంద్ర నిపుణుల బృందాలు శుక్రవారం రాత్రి మంగళగిరిలోని ఏపీఐసీసీ కార్యాలయంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ చక్రధర్‌బాబు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నాయి. పలువురు నిపుణులు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు. ప్రొఫెసర్ డాక్టర్ కామిని మెండిస్, డాక్టర్ నిర్మల్ జో, డాక్టర్ లోకేశ్ కోరి, డాక్టర్ ఆర్య రాహుల్, డాక్టర్ పి.కె. సేన్, డాక్టర్ ప్రణబ్ జె. భుయాన్, డాక్టర్ బద్రి థాపా తదితరులు పాల్గొన్నారు.

సీఎం డ్యాష్‌బోర్డు ద్వారా వ్యాధి నిఘాను పర్యవేక్షించడం, ‘అవేర్’ వ్యవస్థ ద్వారా మలేరియా కేసుల పరిస్థితిని అంచనా వేసి వాటి నిర్వహణను పర్యవేక్షిస్తున్న విధానం నిపుణులను ఆకట్టుకుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజారోగ్య కార్యక్రమాలతో అనుసంధానించడం ద్వారా వ్యాధి నియంత్రణకు రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు.

**గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ సేవలు**

చేరుకోవడం కష్టమైన గిరిజన, మారుమూల ప్రాంతాల్లో రోగుల నిర్ధారణ, చికిత్సకు అవసరమైన సేవలను అందించేందుకు డ్రోన్ ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్న తీరును నిపుణుల బృందాలు పరిశీలించాయి. రోగులను సమీప ఆసుపత్రులకు తరలించేందుకు ఫీడర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడాన్ని కూడా ప్రశంసించాయి. మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ విధానం ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నాయి.

**ఫ్రైడే--డ్రై డే’కు ప్రశంసలు**

దోమల వృద్ధికి కారణమయ్యే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించడంతో పాటు మలేరియా, డెంగీ తదితర వెక్టర్ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ‘ఫ్రైడే--డ్రై డే’ కార్యక్రమాన్ని నిపుణులు అభినందించారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో దీర్ఘకాలిక క్రిమిసంహారక దోమతెరల (ఎల్ఎల్ఐఎన్) పంపిణీ, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని కూడా గుర్తించారు.

**మరింత బలోపేతానికి సూచనలు**

మలేరియా నియంత్రణలో రాష్ట్రం అనుసరిస్తున్న సమగ్ర విధానం మెరుగైన ఫలితాలకు దోహదపడుతోందని నిపుణులు పేర్కొన్నారు. ముందస్తు వ్యాధి నిర్ధారణ, సకాలంలో చికిత్స, వ్యాధి నిఘా, దోమల నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ, కేసులను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించే విధానంపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని సూచించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467